# నెనరు

"నాంపెల్లా...... ఎప్పుడచ్చింది" భయంగా అడిగిండు రాజమల్లు.

"నిన్ననే.... గడియ ఎనుకముందైతే ఇద్దరు కలుసుకుందురు. సువ్వటు దాటినవో లేదో ఆయిన ఇటు వచ్చింది" ఏడుపును ఆపుకుంట చెప్పింది లచ్చిమి.

రాజమల్లుకు సల్ల చెమటలు పుట్టినయి. చేతులు నలుపుకుంట "బాల... బాల ఎక్కడున్నదటనే..." అన్నడు.

"పట్నంలనే ఉందట. రేపో మాపో అన్నట్టుందట. నన్ను తోలుక పోదామని వచ్చిండట. మాపటి బస్సుకెక్కితే తెల్లారెముందట చేరుకుంటమన్నడు. పాత బట్టలు, ఎల్లిగడ్డ, జీడి గింజలు మూట గట్టిన. ఒక్క గడియైతే అవుతల వడుదుంటిమి" లచ్చిమి కండ్లు తుడుచుకుంది.

రాజమల్లుకు కండ్లల్ల నీళ్ళు తిరిగినయి. కొడుకు మీద కోపమచ్చింది. "ఒరే బుచ్చిగే.... షికారి వద్దని చెప్పలేదురా... నీకు ఊరి మర్మం తెలువది పోకురా అంటి. ఇప్పుడు లేని కథ వెడితివి. వాడంటే పోరడు. నీకు తెలువదాయె. ఊర్లెకు ఎందుకు పోయినవు" యాష్టపడ్డడు.

చెట్టుకింద బీరిపోయి కూసున్న బుచ్చి భయం భయంగా తండ్రి దగ్గెరికచ్చింది. బుచ్చి వెంట రెండు కుక్కలు తోక ఊపుకుంట వచ్చినయి. పెద్ద కుక్కలు మూడు దూరంగా నిలబడి రాజమల్లును సూత్తన్నయి. పిల్లల కోళ్ళు రెండు గుడిసె సుట్టూ తిరుగుతున్నయి.

లచ్చిమి మరోసారి కండ్లు తుడుసుకుంది. ఏడుపు ఆగుతలేదు. "చేతుల ఒక్కపైస లేదాయె. ఉత్త చేతులతో ఎట్ల పోవాలనుకున్న. యాభయో నూరో వత్తె బిడ్డ చేతుల వెడుదామనుకున్న" అన్నది ఏడుసుకుంట.

ఎవలను కలువాలెనో, ఏం జెయ్యాలెనో, ఎటుపోవాలెనో తెలుస్తలేదు రాజమల్లుకు. సంచారం బయిలెల్లి నెలదాటలేదు. ఒక ఊరు సూసుకుని రెండు రోజుల కిందనే ఈ ఊరు వచ్చింది. రెండేండ్లకోసారి వచ్చి వారమో నెలనో ఉన్నా, అడివి మర్మం తెలుసుగనీ ఊరి మర్మం తెలువది. ఎవలు పైరో కారో తెలువది.

"ఎవలే.... ఎవలకమ్మినవు. ఏమన్నడు" అడిగిండు రాజమల్లు.

లచ్చిమికి గొంతు పెకుల లేదు. నాలుక తడుపుకుంటూ బుచ్చి చెప్పింది. "వన సమితి చేర్ మినట. పది రూపాయాలిత్త కల్లు దాగిపోండ్రి అన్నడు. మూడు కిలోల కుందేలు, రెండు వందలు చెప్పి వంద ఇయ్యిమన్నం. పదికి పది పైసలు ఎక్కువియ్యనన్నడు. మేము వందకు పైస తక్కువియ్యనన్నం... మీ సంగతి చూస్తనన్నడు."

"పోలీసులు ఎప్పుడచ్చిండ్రు..." కొద్దిగ తేరుకుంటూ అడిగిండు రాజమల్లు.

"మసుకు వడుతుంది. ఊర్లెనుంచి వచ్చి బట్టలు సదురుకుంటున్న. జీబచ్చి ఆగంగనే పాణం ఎల్లుకపోయింది. నన్ను అడ్డంనూకి ఇద్దరిని జీబుల ఏసుక పోయిండ్రు...."

"లచ్చిమి ఆగిపోయింది. తరువాత ఏం జరిగిందో బుచ్చి అందుకున్నాడు." టేషన్ల పెద్దసారు అన్ని సంగతులన్నొక్కనే ఇడిసిపెట్టిండ్రు" అన్నాడు.

పంది పేరు వినంగనే ఉల్కిపడ్డడు రాజమల్లు. తను ఆగమైతే లచ్చిమి, బుచ్చిగాడు ఇంకింత ఆగమైతరని నిలదొక్కుకుంటున్నడు గానీ గుండె కలికలయితుంది. బాలనే కండ్ల ముందు కదులుతుంది.

ఎట్లన్నగానని ఊరు చివరున్న టేషన్‌కు చేరుకున్నడు రాజమల్లు. అప్పటికి పొద్దు బారెడెక్కింది. టేషన్ల ఎస్సై లేడు. వచ్చేదాకా ఆగిండు.

'ఫోర్క్ దెత్తవంటే ఉత్త చేతుల వచ్చినవేందిరా... వీన్ని గూడా లోప లెయ్యిండ్రిరా..." ఎవడినడిగి ఊర్లెకచ్చిండ్రురా' అన్నడు ఎస్సై.

"దొరా.... నాబిడ్డ దొరా.... బరువు మనిషి. పొద్దులు నిండినయి. వాన్ని పంపుడ్రి దొరా... పొద్దు గూకే వరకు పంది మీ కాళ్ళ కాడుంటది...." అని బతిమిలాడిండు కాళ్ళు మొక్కిండు.

పోలీసులు నవ్విండ్రు. చిన్న సారంటే పెద్ద సారు.... పెద్దసారంటే చిన్నసారని కొంతసేపు ఆడుకున్నారు. నాంపెల్లి దూరంగా చెట్లకు నీళ్ళు వడుతుండు. అల్లున్ని గూడా కలువనియ్యలేదు వాళ్ళు. ఇడిసి పెట్టరని అర్థమయ్యేసరికి పొద్దు నెత్తిమీదికెక్కింది.

రాజమల్లుకు కండ్లకు రక్తమచ్చింది. పోలీసులను ధిక్కారంగా చూసి బయటకచ్చిండు. వస్తూ వస్తూ నాంపెల్లిని చూసిండు. చేతుల బిందెను పక్కన బెట్టి బీరిపోయిండు నాంపల్లి.

మంటర మంట ఇంటికచ్చిండు రాజమల్లు.

అల్లుడత్తడని ఆశతో ఎదురు సూత్తన్న లచ్చిమి రాజమల్లును చూసి గుడ్ల నీళ్ళు గుడ్లళ్ళ కుక్కుకుంది. ఏమైందని అడగాలంటే బయమయింది. అతన్ని కదిలించాలని "పంచాది పాడుగాను పంచాది నిన్ననే వడె. పోతె ఒక పరిషా నాయె. పోకపోతే ఒక పరిషానాయె. దదువతులు పెట్టుకుని వానకాలం ఇంటికి చేరుకున్నంక పంచాదులు పెడుదురు. ఇప్పుడేంబుట్టిందో కులానికి. ఎప్పటిదప్పుడే పంచాదులు తెగాలంటుండ్రు' అన్నది.

రాజమల్లు నోరు తెరువలేదు. గుడిసెలకు పోయి గట్టగట్ట రెండు చెంబుల నీళ్ళు తాగిండు. మూలకున్న సలాకబర్సిని చేతుల పట్టుకున్నడు. వైరు పగ్గాన్ని నడుముకు సుట్టుకున్నడు.

రాజమల్లు ఎప్పుడైతే బరిసెను చేతులకు తీసుకున్నడో.... అప్పుడే సంగతంతా అర్థమైంది లచ్చిమికి. గొంతుతడారి నాలిక పిడుసగట్టుకపోయింది. 'అయ్యో.... బాలా... ఎట్లుంటివో బిడ్డా.... ఒంటిదానివైపోతివి. నా చేతుల్ల మన్నువడ ముందుగల్లనన్నా తోలుకచ్చుకోపోతిని.... ఊరికిన్ని నీళ్ళు తాగుదాయె ఉండని తియ్యి అనుకుంటి.... ఆయాల్లకుపోనా అనుకుంటి. దిక్కులేని దానివైతివి. కండ్లు తెరవని ఇద్దరు పసిపోరలుండిరి అనుకుంది. బిడ్డ మనుసుల మెదులంగనే కండ్లపొంట నీళ్ళు టపటపరాలినయి.

రాజమల్లు భార్య దిక్కుకు సూడలేదు. సూస్తే ధైర్నం గూడా లేదు. మాట్లాడే ధైర్నం గూడా లేదు. బయటికచ్చి 'జూ' అని కుక్కలను పిలిచిండు.

ఒకప్పుడు గంగెద్దులు ఆడిత్తుండె రాజమల్లు. గంగెడ్ల లేవ్వగని గంగెద్దులోలె కుక్కలున్నాయి. మూడు కుక్కలు ఉరికచ్చి కాళ్ళను సుట్టుకున్నాయి. చెట్టు కింద కూసున్న బుచ్చికి గూడా సంగతంతా అర్థమైపోయింది. 'రాజూ...' అని తన రెండు చిన్న కుక్కలను పిలుచుకున్నాడు. అందులో ఒకటీ మరీ చిన్నది. దానిని మర్రి చెట్టు ఊదకు కట్టేసిండు. గుడిసెలకుపోయి తన చిన్న బరిసెను అందుకున్నాడు. మోకాళ్ళకు మోచేతులకు పట్టీలు తొడుక్కుని బయటకచ్చిండు.

అది చూసి 'బుచ్చీ.... నువ్వద్దురా.... లోతు జంగల్లకు పోవాలె. అసిరె పోరనివి. పొదలు చెట్లు బాగున్నయి' అన్నాడు రాజమల్లు.

బుచ్చికి అక్క యాదికొచ్చింది. పోలీసులు యాదికచ్చిండ్రు. తండ్రి మాటను ఇనసట్టే ముందుకు నడిచిండు.

ఇంకోసారైతే లచ్చిమి కొడుక్కు అడ్డం తిరిగేదే. వద్దని తండ్రికి చెప్పేదే. ఇప్పుడు ఆమె కాళ్ళు కదులుతలెవ్వు. మనసు మాత్రం తొక్కులాడుతుంది. 'ఎండపూటరా... బుచ్చి. పందికి ఎండకు పడది గదా! ఒగరుకొడుతూ కోపం మీసుంటది. మంటతో కాలి పిక్కలందు కుంటది. పొద్దు వంగి సల్లపడని 'భర్తకే గాని కొడుకుతో చెప్పినట్టుగా చెప్పింది' లచ్చిమి.

అడవి పంది గురించి రాజమల్లుకు తెలుసు. అది ఎప్పుడెట్లుంటదో... ఏ వాటం మీద పొడువాలెనో తెలుసు. ఎంత కష్టమో కూడా తెలుసు. ఉరుకడం చేతగాక ఈ మధ్య కుందేళ్ళు, ఏదులు, పిట్టలు తప్ప పందుల శికారే మానుకున్నడు. అనువుగాదని తెలిసినా తప్పని పరిస్థితిలో ముందుకు నడిచిండు.

బుచ్చి ఆగదని రాజమల్లుకు తెలిసిపోయింది. ఆ ఇద్దరూ ఆగరని లచ్చిమికి తెలిసిపోయింది. ఆగాలని కూడా అనుకోవడం లేదు. పంది దొరకాలని దేవుండ్లకు మొక్కుకుంటుంది. మొక్కుకుంటనే గుడిసెలకు పోయి పసుపును కాయిదంల కట్టుకుని తెచ్చింది. "బుచ్చీ జేబుల పెట్టుకోరా... పంది జీరితె పసుపే మందు. సున్నంల కలిపి కట్టిన" అంది.

బుచ్చి ఎనక్కి తిరిగివచ్చి పొట్లం అందుకున్నడు. అందుకుంటూ 'అవ్వా... నువ్వూ, బావ పోరనుకో... అక్కకు ఏమైతదే..." అన్నడు. ఇదంతటికి తనే కారణమన్న బాధ ఉంది బుచ్చికి.

లచ్చిమి కండ్లు నీళ్ళతో చిప్పరిల్లినయి. నోరు తెరిచి కొడుకును చూసి "అది పట్నం బిడ్డా... బతుకపోయినజాగ. గుడిసెల ఒక్కతే ఉండట... నిన్ననే కడుపు నొత్తంది అన్నదట... సుట్టు బంగులాలుదప్ప గుడిసెలు గూడా లెవ్వట. అక్కడి కట్టపు కానుపు..." ఇంక మాట్లాడుదామన్నా గొంతు పెకలలేదు. ఒకవేళ మాట్లాడినా బుచ్చి అక్కడ నిలబడి వినడానికి సిద్ధంగా లేడు.

అప్పటికే మూడు కుక్కలతో రాజమల్లు పిల్లతొవ్వ పట్టిండు. 'రాజూ' అని పిలుచుకుంట బుచ్చి పరుగందుకున్నడు. చిన్న కుక్క బుచ్చి వెంట గంతులేసింది. కట్టేసిన కుక్క గుంజుకుంటూ మొరుగుతుంది.

"బుచ్చి... పైలంరా... సుట్టు పల్లి చేన్లున్నాయి. నూనె దినుసుగదా... పల్లి దిన్న పంది మదం మీదుంటది. నీకు సూటి బాగుంది గదా! ముక్కుమీదనే పొడువు. పందికి ఎదురుపోకుబిడ్డా – కుందెలులెక్కగాదు' కేకవేసి చెప్పింది లచ్చిమి.

తండ్రీ కొడుకులిద్దరూ ఎన్నోసార్లు షికారుకు పోయిండ్రు. ఎప్పుడూ అట్ల ఆగంగాలేదు లచ్చిమి. యాల్లగాని యాల్ల పగటి యాల్ల... అదీ ఆకులు పచ్చగున్నకాలంల అడివి పందిని కొట్టుడంటేనే భయంగా ఉంది. అసలు పంది దొరుకుతదా లేదా అన్నది ఇంకో బయం. తండ్రీ కొడుకులిద్దరినీ చూసుకుంట అట్లనే నిలవడింది.

ముందు మూడు కుక్కలు పసిగట్టుకుంటపోతున్నయి. ఎనుక రాజమల్లు పోతున్నడు. తండ్రెనుక కొడుకు చిన్నకుక్కతో పోతున్నడు. కుక్కలు కుక్కలలెక్క గాక పులుల లెక్క ఉరుకుతున్నయి.

"నాయినా... ఇది ఆకురాలిన కాలంగాదు. పొదలుంటయి, చెట్లుంటయి పందులు దొరుకయిగదనే... కుందేలునో ఏదునో తెత్తనద్దాయె.... వలలు అడ్డంగట్టి ఉరులు వెడుదామన్నా ఇద్దరు మనుసులం నాలుగు కుక్కలు షికారికి ఏమూలకు సరిపోము" నడుత్తూ అన్నాడు బుచ్చి.

"బతిలాడినరా.... వాళ్లు ఇనలేదు. ఇగ అక్కయాదికచ్చి నాపానం కలికలయింది. ఒక్కతి ఎట్లుండెనో ఏమో... పట్నమద్దు గిట్నమద్దు ఇంటికాడనే ఉండుండంటే ఈ పిస్సోడు పట్నం పోయి సంపాయిత్తనని పట్నంలవడె. పోదామన్నా ఏ సందో ఏగల్లో తెలువదాయె. బావను ఇడిసిపెడితే నా పాణమైనా ఇద్దామన్నంత జోశిమీద బయటకచ్చిన" చెప్పుతూ నడుత్తున్నడు రాజమల్లు.

కొడుకుతో మాట్లాడుతున్నా అతని చూపు మాత్రం కుక్కలమీదనే ఉంది. వాటినే గమనిస్తున్నడు. కుందేలు వాసన పసిగడితే కుక్కలు నిలువునా పొంగుతయి. ఉరుకడానికి సిద్ధంగా ఉంటయి. ఏదునుచూస్తే కుక్క రోమాలన్నీ నిక్కపొడుస్తయి. పందివాసన పసిగడితే మాత్రం కుక్క నడుము వంచుతది. కుంగిపోయి నిలవడుతది. ఎగురడానికి సిద్ధంగా ఉంటది. నక్కనో తోడేలునో పసిగడితే మాత్రం కుక్క మీదికి మొఖం పెట్టి సోకం బెడుతది.

"నాయినా పంది దొరుకకపోతే ఎట్ల..." అనుమానంగా అడిగిండు బుచ్చి. ఉలిక్కిపడ్డట్లు రాజమల్లు ఎనక్కి తిరిగి చూసింది. "ఇది పందిలొద్దిరా బుచ్చి... సుట్టూ పల్లిచేస్లు చెరుకు తోటలున్నయిగదా.... పందులు బాగానే ఉంటయి. ఎటచ్చి మన పిక్క బలంగావాలె. ఈ కాలంల కుక్కలు పందిని ఆపలేవు. అదీ ఒంటెనగాడైతే కుక్కలను చీరిపోతది. అప్పట్ల ఒకటీ రెండుసార్లు వచ్చినం గదా... వట్టిగ పోలేదు" అన్నడు ధైర్యంగా.

మాట్లాడుతనే ఇద్దరూ లొద్దిని దాటి దరేసాబుల గుట్టఎక్కిండ్రు.

"గుట్టకింద గుండ్లున్నయి నాయినా... అటుపోదాం" లొద్ది దాటుతుండగనే అన్నడు బుచ్చి.

"ఒరే బుచ్చి ఆకులున్నకాలంల పందులు గుట్టలకింద గుండ్లకింద ఉండయిరా... పరికి పొదలల్లనే పంటయి. తోకలన్నీ నడుమ కలుపుకుని మూతులు బయటకు పెడుతయి. అలికిడయితే పొదల దాక్కుంటయి" అన్నడు.

గుట్టమీద పెద్ద పెద్ద చెట్లున్నయి. అడుగడుగునా పొదలున్నయి. వాటిని చూసినంక పందిని గెదుముతూ ఉరుకుడు కష్టమే అనిపించింది రాజమల్లుకు.

కుక్కలు పొదలన్నీ పసిగడుతూ తిరుగుతున్నయి. తిరిగి తిరిగి రాజమల్లు దగ్గరకు వచ్చి ఆగిపోతున్నయి. అక్కడ జంతువులేవీ లేవని అర్థమైంది రాజమల్లుకు.

ఎన్ను మీదికి ఎక్కి ఒకసారి గట్టిగా జో... జో... అన్నడు.

చెట్టుమీది పిట్టలు ఎగిరిపోయినయి. ఉడుతలు తొండలు ఉరుక పుచ్చుకున్నయి. కుక్కలు భౌభౌమని మొరిగి పొదల చుట్టూ తిరిగినయి. మళ్ళీ రాజమల్లు కాళ్ళదగ్గర కూసున్నయి.

'జో... జో..' అనుకుంటూ గుట్టకు అటువైపు నుండి కిందికి దిగడం మొదలుపెట్టిండు రాజమల్లు. వెంట బుచ్చి చిన్నకుక్క నడుస్తున్నరు. తండ్రి

గొంతుతో గొంతు కలిపి జో...జో... అంటుండు బుచ్చి. కాళ్ళ కింద రాళ్ళు ముండ్లు. పరికిపొదలు కాళ్ళకు గీరుకపోతున్నయి.

హఠాత్తుగా పెద్దకుక్కలు మూడు ఆగిపోయినయి. నిలువునా పొంగి వెన్నువిరిచి ముందుకు ఉరికినయి. పొద చుట్టూ చుట్టుకున్నయి. బౌ... బౌ... మని పొద మీద పడ్డయి.

"నాయనా... పందేనే... ఉరుకు' అన్నడు బుచ్చి. చేతులున్న బరిసెను గురిచూసి పట్టుకుంటూ. రాజమల్లు బరిసెను ఎత్తి మల్లా కిందికి దించిండు. కుక్కలను పట్టి పట్టి చూసిండు.

"కాదురా... కుందేలున్నట్టుంది. పంది అయితే గుట్టమీదనే ఉంటది. లేకుంటే గుట్టకిందనే ఉంటది. వాలు మీద అసలే ఉండది. దానికి సమతలంగావాలె" అన్నడు.

అన్నట్టుగనే కుందేలు ఒకటి కుక్కలకు చిక్కినట్టే చిక్కి పారిపోయింది. కుక్కలు కొంతదూరం వెంబడించి ఆగిపోయినయి. ఇంకోసారైతే ఉరుకుతున్న కుందేలు మీద వలవిసిరేవాడే బుచ్చి. ఇప్పుడు ఈ వెతుకులాట దానికోసం కాదు. కాబట్టి ఆగిపోయిండు. నిన్న దొరుకకపోయినా బాగుండు అని కుందేలును తిట్టిండు.

రాళ్ళు పొదలు. కాళ్ళకు చీరుకపోతున్నయి. రక్తం దారలు కడుతుంది. ఎండమండుతుంది. దూప మొదలయింది. మొగులుమీద అప్పుడప్పుడు నల్లటి మబ్బులు కదులుతున్నా నీడలేదు. ఉడుకపోత ఎక్కువై బట్టలు తడిసిపోయాయి.

వాలు దిగిన రాజమల్లు పతుకు లాడుకుంట లొద్దిలకు దిగిండు. లొద్ది రెండు బోర్ల నడుమల ఉంది. పొదల తీగలు అల్లుకుని దట్టంగ ఉన్నయి. సందులేకుంట చెట్ల కొమ్మలు అల్లుకున్నయి. కిందంతా నాలె పల్లేరు మొలిచింది. అడుగడుగున ముండ్లే. కిందినుంచి సన్నటి ఒర్రె పారుతుంది.

అది చూసినంక 'బుచ్చి ... ఇదిరా పందిలొద్ది. ఇక్కడ తప్పకుంటా పందులుంటయి' అనుకుంట 'జో... జో...' అన్నడు రాజమల్లు. అంటూ ఒర్రెల నీళ్ళు ముంచుక తాగిండు. తండ్రితో నోరు కలుపుతూ మునివేళ్ళమీద నడిచి నీళ్ళు తాగిండు బుచ్చి. గీరుకపోయిన కాళ్ళకు నీళ్ళు తలిగి బగ్గుమన్నది. కాళ్ళు గుంజుతున్నయి.

కుక్కలు పొదలు పొదలు తిరుగుతూ నడుత్తున్నయి. అటు ఉరికి ఇటు ఉరికి రాజమల్లును చేరుతున్నయి. 'జో... జో' అని జోర్రుకుంట నడుత్తుండు

రాజమల్లు. లొద్దిలకు పోతున్నకొద్దీ చెట్ల నీడ చీకటిగా మారుతుంది. ఎండవేడి చల్లగా మారుతుంది.

"నాయినా... దేవగనికెలు ఇసొంటి జాగలనే ఉంటయి గదా.... ఇది పెద్ద గుహలెక్కుంది. దేవగనికెల మెడల బంగారముంటదటగదా.... ఏదడిగితే అదిత్తరటగదా..." అడిగిండు బుచ్చి.

రాజమల్లు కథలు కండ్లకు గట్టినట్టు చెప్తాతడు. దేవగనికెల గురించి ఎన్నో కథలు తెలుసు. అవి మనుషులతో సోపతి చేసి జతగట్టిన కథలు తెలుసు. పేదవాళ్ళను ధనవంతులుగా చేసిన కథలు తెలుసు. కానీ ఇప్పుడు చెప్పేట్టులేదు. మనుసంతా పందిమీదనే ఉన్నది. అందుకే మాటమార్చి 'నేను ఈ వాలు నుండి పైకెక్కుత. నువు ఆ వాలు నుంచి పైకెక్కు. కింద నీటి సవులతుంది గావట్టి తప్పక పైన పందులతావుంటది' అన్నడు ఎదురుగా ఉన్న గుట్టను చూపిస్తూ.

బుచ్చి ఆ వాలుకు రాజమల్లు ఈ వాలుకు అడ్డంగా గుట్టనెక్కింండ్రు. ఎంట కుక్కలు తిరిగి తిరిగి కలుసుకుంటున్నయి. జో...జో... అని జోపుతుండ్రు. కేకలేత్తండ్రు. ఎన్ను మీద ఇద్దరు కలుసుకున్నరు. మొఖాలు చూసుకున్నరు. పంది జాడనేలేదు.

'నాయినా... ఈ గుట్టలల్ల పందులు ఉండయేమోనే... ఇంకో వాలుకుపోదామా....' తువ్వాలతో చెమటను తుడుచుకుంటూ అన్నడు బుచ్చి. రాజమల్లులో ఇంకా ఆశ చావలేదు.

చుట్టు చూసి "ఇక్కడ ఉండకపోతే ఈ భూమండలం మీద ఎక్కడ ఉండనట్టేరా బుచ్చి... గుట్టకింద పల్లి చేన్లున్నయి. పక్కనే నీళ్ళున్నయి. మీద చీకటి పొదలున్నయి. అనువైన తావు ఇదే. ఎన్ను మీద జోపుదాం. గుంపులు గుంపులు లేత్తయి" అంటూ బర్సి సలాకతోని జో...జో... అని జోపుతూ ఎదురుగా ఉన్న పొదలను కొట్టిండు రాజమల్లు. అట్ల ఇంకో గంట తిరిగిండ్రు. జోపిండ్రు. కుక్కలను ఎగేసిండ్రు. పంది వాసనే తలుగలేదు.

అప్పటికి పొద్దువంగింది. ఎండ సల్లవడ్డది. మైసమ్మ మూలకు నల్లవడ్డ మొగులు పైకి ఎక్కుతుంది. తెప్పలు తేలుతున్నయి. రాజమల్లుకు ఆశ సన్నగిల్లి దడ మొదలయింది. అయినా ఎన్నుమీది పొదలను జోపుతనే ఉన్నడు.

కొడవలి వంపు తిరిగిన గుట్ట. ఎంతనడిచినా దంగుతలేదు. బుచ్చికి కాళ్ళు గడ్డలు గట్టినయి. గొంతు బొంగువోయింది. అయినా లేనిబలం

తెచ్చుకుంట జోపుతనే ఉండు. కుక్కలు కైరతు మీదున్నయి. తొండ కదిలినా... ఉడుత ఉరికినా ఎంటవడి తరుముతున్నాయి.

కొంతదూరం పోయినంక ఒక పొదలో గిరుక్కుమని సప్పుడు ఇనవడ్డది బుచ్చికి. ఆగి చూసిండు. చిన్నగ తోక కనపడ్డది. అది పందితోక లెక్కనే ఉంది. కానీ పందెప్పుడు ఒంటిగుండది నాలుగైదు ఒక్కటే చోట గుంపుగా ఉంటయి.

ఎందుకయినా మంచిదని 'నాయినా... పంది' అన్నడు బుచ్చి. ఆ మాటలు వినంగనే అడుగుల సప్పుడు గాకుంట పరిగెత్తుకచ్చిండు రాజమల్లు. 'ఏదిరా బుచ్చి' అన్నాడు పొదలకు తొంగిచూసి. నర్రెంగ చెట్టుకు తిప్పతీగ గురిజ తీగ అల్లుకున్న పొద అది. లోపల చీకటిగా ఉంది. అయినా పంది కదిలిన నీడ కనపడుతుంది.

రాజమల్లుకు ప్రాణం జిలజిలమంది. ఆయాసం నొప్పులు మాయ మయినయి. పందా కాదా అని పట్టిపట్టి చూసి 'బుచ్చీ పందేరా... ఒంటెనగాడు ఇడిసిపెట్టద్దు' గుసగుసగా అని కుక్కల కోసం చూసిండు.

కుక్కలింకా పసిగట్టనట్టున్నయి. ఎక్కడెక్కడికో తిరుగుతున్నయి. అప్పటికప్పుడే ఒక ప్లాను మెదిలింది రాజమల్లుకు. పంది ఎప్పుడూ పక్కలకు తిరిగి ఉరుకది. దానికి మెడలు తిరుగయి.

"అరే బుచ్చి.... ఎనుకనుండి నువ్వు గెదుమురా... పొదముందట నేనుంట. బర్మితోని పొదుత్త, ఒకయాల్ల తప్పిచ్చుకున్నా సప్పుడుకు కుక్కలు ఎంటపడతయి" అని పొదచుట్టూ తిరిగి బరిసెతోని ముందు నిలవడ్డడు.

ఎనుకనుంచి బుచ్చి బర్మితో పొదను పొడిచిండు. అంతే! మొగులు మీది నుంచి వాన చినుకు రాలినట్టు ఈ పొదలనుంచి ఇంకో పొదలకు దుంకింది పంది. రాజమల్లు బర్మి ఎదురుగా ఉన్న చెట్టు మొదలుకు దిగింది.

"అరే పాయెరా..." అన్నాడు రాజమల్లు.

"జూ... జూ..." అని కుక్కలను పిలిచిండు బుచ్చి. అప్పటికి రెండు పొదలు దాటి గుట్టకిందికి దిగింది పంది. వెంట ఉరుకవోయి కాలుకు కట్లెతీగ తట్టి ఇరుసుకపడ్డడు రాజమల్లు. చెట్టు నెత్తికి గుద్దుకుని రక్తంగారింది. అయినా ఆగకుంట లేచి పంది ఎంట పడ్డడు. బుచ్చి కుక్కలను పిలుసుకుంట రెండుపొదలు దాటి పందికి అడ్డం తిరిగిండు.

క్షణాల్లో మాయమైపోయింది పంది. ఎక్కడా కనిపించలేదు.

"నాయినా... ఏదే కనవడుతలేదు" అరిచిండు బుచ్చి.

"ఇక్కడనే యాడనో ఉంటదిరా..... గుట్టదిగిమైదానంల వద్దనుకో.... మనకు దొరుకది... వాలుమీదైతే ఉరుకరాదు. ఇక్కడనే పనిపట్టాలె" అంటూ చుట్టూ ఉన్న పొదలను కొట్టిండు. సప్పుడు లేదు.

ఎక్కడనుంచి పసిగట్టాయో కుక్కలు.... నాలుగు ఒక్కసారిగా వచ్చి ఒకపొద మీద పడ్డాయి. గుర్కు గుర్కుమని పంది ముందుకు ఉరికింది. కుక్కలు పందిని ఇడువలేదు ఎంటపడ్డయి.

"బుచ్చి ... ఉరుకురా.... కుక్కలు అందుకుంటయి.. పంది పెద్దగున్నది చెలుపుకుని అవుతల వడుతది" అంటూ ఎంటపడ్డడు రాజమల్లు.

అడుగడుగునా ముండ్లు. అడ్డంగా పొదలు పాపుకొనిపోవుడు. ఉరుకత్త లేదు. సూత్త సూత్తండంగానే కుక్కలు పంది మాయమైనయి. అరుపులు మాత్రము ఇనిపిస్తున్నయి. అయ్యకొడుకులు ఎనుక చిక్కిండ్రు.

జూ..... లగా.. లగా....ఉస్కిలగా.... అని కుక్కలను ఎగేసుకుంట చెరో దిక్కునుంచి ఉరికిండ్రు.

కుక్కలకు మంచి పట్టు దొరికింది. పొదలులేని దగ్గర పంది చుట్టూ సుట్టుకున్నయి. ఒర్రుకుంట అడుగు ముందుకు కదులనిత్తలెవ్వు. పంది గర్రు గర్రు మనుకుంట లోపలనే తిరుగుతుంది. పక్కనే పెద్ద గుండుంది. గుండుకు పందికి నాలుగడుగులే.

'అరే... బుచ్చీ... ఇదిరా వాటమంటే! మనపంట పండినట్టే. గుండుకు నువ్వు అటు దిక్కునుండు. నేను ఇటు దిక్కునుంట. అనుక జబ్బలపొడుద్దాం. అమ్మ అడుగు జరుగది. ఇంత కట్టపడ్డందుకు పంది జెట్టన్నే పడ్డది అనుకుంట కుక్కలను ఎగేసి గుండు సాటుకు వచ్చిండు రాజమల్లు.

కుక్కలు అడుగు జరుగనిత్తలేవ్వు పందిని. మీది మీదికి ఉరుకుతున్నయి. బౌ బౌ మంటున్నయి. పంది కుక్కలమీదికి ఉరుకుతుంది. అవి తప్పుకుని ఎదురుతిరుగుతున్నయి రాజమల్లు బరిసె బిగవట్టిండు. సూది మొనలెక్క సొచ్చుకుపోయె బరిసె. ఎక్కడ దిగినా పంద అవుటే. జబ్బల దిగితెనైతే అడుగు ముందుకెయ్యది.

కన్నుమూసి బలాన్నంతా చేతులకు తెచ్చుకుని ఇసురవోయి టక్కున ఆగిపోయిండు రాజమల్లు. అవునా అన్నట్టు మరోసారి చూసిండు. పంది సనిరొమ్ములు ఆరలేదు. ఎరుపెక్కిబిర్రుగా ఉన్నయి. పొట్ట ఇంకా ఎత్తుగానే ఉంది. జారిన ముడ్డివాపు ఇంకా గుంజనేలేదు. తోకమట్ట ఇంకా సన్నవడలేదు. రాజమల్లు చేతుల బరిసె జారిపోయింది.

"బుచ్చి... ఆగురా పొడవకు...." అంటూ ముందుకు నడిచి కుక్కలను దగ్గిరికి తీసుకున్నడు. సందు దొరుకంగనే గుర్రు గుర్రుమంటూ పంది అవుతల వడ్డది. అప్పటికే పొద్దు నిండుకున్నది.

బుచ్చికి పిచ్చిలేసినట్టయింది. కోపంగా బయటకచ్చి "నీ కేమన్నా తులుకాయుందా" అన్నడు. రాజమల్లు మొఖంల ఏ బావము లేదు. "అందుకే గదా ఇడిసిపెట్టింది. పచ్చి బాలెంత. పిల్లలను యాడ కాటగలిపిందో... దేవులాడుకుంటుంది. దాని పిల్లల్ల అది కలువని" అన్నడు కండ్లకు నీళ్ళు తీసుకుంట.

● తెలంగాణ సోయి త్రైమాసిక సాహిత్య సంచిక - 14 ●